క్లుప్తంగా

రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్):పట్టణంలోని ఎస్పీజీ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ సుజాత బృందం సహకారంతో 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారని ప్రిన్సిపాల్ దివాకర్ తెలిపారు. విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎస్టీయూ నాయకుడు రియాజ్ మాట్లాడుతూ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం, విద్యార్థులు స్పందించడం అభినందనీయమన్నారు. శిరోమణి, నళిని, మధు, కెజియా, శేఖర్, కిశోర్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



బీఎల్ఓలకు సూచనలు చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్

ఉయ్యాలవాడ: ఈ నెల 23, 24 తేదీల్లో మండలంలో నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు బీఎల్ఓలకు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే యువతి, యువకులు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓల వద్ద ఓటు హక్కు దరఖాస్తులు పొందవచ్చని తెలిపారు. ఓటరు నమోదుపై గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

శిరివెళ్ల: స్థానిక జెండాపేట అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు ప్రభుత్వ వైద్యాధికారి దివ్య ఆరోగ్య పరీక్షలు చేశారు. కేంద్రంలోని 6 సంవత్సరాల్లోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య విషయాలను అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి మందులు ఇస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాంమోహన్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి బాలోత్సవ్- 2024లో 50కి పైగా బహుమతులు సాధించడంలో గురురాజ విద్యార్థుల కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ స్థాయి బాలోత్సవ్ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని డీఈఓ సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రవికృష్ణ, విద్యాసంస్థల డైరెక్టర్లు షేక్షావలిరెడ్డి, మౌలాలిరెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

చాగలమర్రి: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకు కాలనీలో ఉన్న జనని మ్యాక్స్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. శాంతిరాం ఆస్పత్రి వైద్యులు సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. జనని మ్యాక్స్ సీఈఓ వెంకటరమణ, వైద్యులు చక్రతేజ్, అల్లం శ్రీనివాస్, నరసింహులు, స్వాతిక, మౌనిక పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా లక్ష్మణ్

నంద్యాల(న్యూటౌన్): సీపీఎం నంద్యాల పట్టణ నూతన కార్యదర్శిగా లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడతామని చెప్పారు.

సోలార్ 'కాంతులు'

- సూర్యఘర్‌తో బిల్లుకు చెల్లు
- సోలార్ ప్యానల్‌తో ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి
- సబ్సిడీతో పాటు రుణసదుపాయం
- వినియోగదారులకు మంచిదంటున్న అధికారులు

డోర్నిపాడు: నానాటికి పెరిగిపోతున్న విద్యుత్ బిల్లులతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపించేందుకు కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ అనే పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుని ఉచిత కరెంట్ పొందవచ్చు. జీవితాంతం ఉచిత విద్యుత్ పొందడమే కాకుండా మిగులు విద్యుత్‌ను విక్రయించి ఆదాయం పొందవచ్చు.

సబ్సిడీ చెల్లింపు ఇలా

- సూర్యఘర్ పథకం కింద రాయితీని రెండు భాగాలుగా విభజించారు. రెండు కిలోవాట్ల సామర్థ్యానికి 60శాతం అంతకు పైబడిన యూనిట్లకు 40 శాతం మొత్తాన్ని రాయితీ కింద అందిస్తారు.
- సోలార్ ప్యానెల్స్, సెట్ మీటర్ అమర్చిన తర్వాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది.
- వంద చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలో వాట్ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌కు 3 లేదా 4 ప్యానల్స్‌ను వినియోగిస్తారు. కిలోవాట్ సోలార్ ప్యానల్స్‌కు నెలకు దాదాపు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఐదు కిలోవాట్ సోలార్ ప్యానల్స్‌కు నెలకు 600 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో 300 యూనిట్లు ఇంటి అవసరాలకు పోగా మిగిలిన 300 యూనిట్లను విద్యుత్‌శాఖ కొనుగోలు చేసి, సదరు మొత్తాన్ని వినియోగదారుల బ్యాంకు ఖాతాలో జమచేస్తుంది.
- రిజిస్ట్రేషన్ ఫీజు ఎన్ని కిలోవాట్స్ తీసుకుంటున్నామనే దాన్ని బట్టి ఉంటుంది. ఐదు కిలో వాట్స్‌కు రూ.1,900, అంతకు పైబడితే రూ.5,900 చెల్లించాల్సి ఉంటుంది. మూడు కిలోవాట్స్ లోపు సర్వీసులకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.



ఇంటిపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసే నమూనా చిత్రం

దరఖాస్తు ప్రక్రియ ఇలా...

- ముందుగా పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో పేరును రిజిస్టర్ చేసుకోవాలి. ఇందుకోసం రాష్ట్రం, విద్యుత్ సరఫరా చేసే కంపెనీని ఎంచుకోవాలి. మీ విద్యుత్ కనెక్షన్ కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీని ఎంటర్ చేయాలి.
- కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అక్కడరూఫ్ టాప్ సోలార్ అప్లై చేసుకోవాలి.
- దరఖాస్తు పూర్తి చేసి డిస్కం నుంచి అనుమతులు వచ్చేవరకు వేచిచూడాలి. అనుమతి వచ్చిన తర్వాత ఈ డిస్కంలోని సమోదిత విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఇన్‌స్టలేషన్ పూర్తయిన తర్వాత, ఆ ప్లాంట్ వివరాలను పోర్టల్‌లో సమర్పించి నెట్‌మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.
- నెట్‌మీటర్‌ను ఇన్‌స్టాల్ చేశాక డిస్కం అధికారులు తనిఖీలు చేస్తారు. అనంతరం పోర్టల్ నుంచి కమిషనింగ్ సర్టిఫికెట్ ఇస్తారు.
- ఈ రిపోర్టు పొందిన తర్వాత మీ బ్యాంక్‌ఖాతా వివరాలతో పాటు క్యాన్సిల్డ్ చెక్‌ను పోర్టల్‌లో సబ్‌మిట్ చేయాలి. 30రోజుల్లోగా మీ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది.

సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్ రాయితీ వివరాలు

సామర్థ్యం (కిలోవాట్స్)	విద్యుత్ ఉత్పత్తి (యూనిట్స్‌లో)	ఖర్చు	ప్రభుత్వ రాయితీ
1	120	రూ.60వేలు	రూ.30వేలు
2	240	రూ.1.20లక్షలు	రూ.60వేలు
3	360	రూ.1.80లక్షలు	రూ.78వేలు

సద్వినియోగం చేసుకోవాలి



విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని చేసుకునే పథకం పీఎం సూర్యఘర్. సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీతో పాటు రుణసదుపాయం అందిస్తుంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి సుమారు ఏడేళ్లలో తిరిగి పొందవచ్చు. నెట్‌మీటర్ విధానం ద్వారా విద్యుత్ వినియోగాన్ని తెలుసుకోవచ్చు. ఇప్పటికే ఈ పథకం గురించి విస్తృతంగా పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ పథకానికి సంబంధించి సందేహాలు ఉంటే స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

–రామ్మోహన్, విద్యుత్‌శాఖ ఏఈ

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకొని కాళికాంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం విశేష పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం, పుష్పాభిషేకం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రి, తిమ్మయ్య, నరసింహులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలో నేరాల కట్టడికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక రామకృష్ణా ఆడిటోరియమ్‌లో లాడ్జీల యజమానులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా లాడ్జీల యజమానులు లాడ్జీల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, ఎక్కువ కాలం బసచేసే వారి వివరాలు పోలీసులకు అందించాలని సూచించారు. లాడ్జీకి వచ్చే కస్టమర్ల నుంచి తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకోవాలని చెప్పారు. లాడ్జీకి వచ్చే కొత్త వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. సీఐలు సూర్యమౌళి, సుధాకర్‌రెడ్డి, ఇస్మాయిల్, మల్లిఖార్జునగుప్తా పాల్గొన్నారు.

ఒప్పందాలను రద్దు చేయాలి



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి నాగరాజు

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, నాగరాజులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్ట్ మూడవ మహాసభను కేఎండీ గౌస్ అధ్యక్షతన జరిగింది. మహాసభకు సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గౌతమ్ అదానీపై గతంలో ఎన్ని ఆరోపణలు వచ్చినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేదన్నారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ తీర్మానాలను ప్రకటించారు. పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని, టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వాలని, ప్రతి పేద వాడికి 2 సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. నూనెపల్లె మూలసాగరం అండర్‌పాస్ బ్రిడ్జి సాధనకు కృషి చేయాలని, చామకాల్వకు రక్షణ గోడ నిర్మించాలని, ఉపాధి పనులను కల్పించాలని తీర్మానించారు. దర్శనం, నాయకులు లక్ష్మణ్, వెంకటలింగం, మద్దులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ: వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రబీ సీజన్‌లో మండలంలో అత్యధికంగా పప్పుశనగ పంట సాగు చేశారని తెలిపారు. అలాగే కంది, మినుము వంటి పంటలు కూడా వేశారని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు తేమ శాతం అధికం కావడంతో పంటలకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు తెలియజేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అలాగే ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, జొన్న, వేరుశనగ, ఉల్లి, మినుము పంటలకు బీమా ప్రీమియం రైతులే చెల్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



మూడురాళ్లపల్లెలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా హోమ పూజలు



ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి: మండల కేంద్రం నుంచి మూడురాళ్లపల్లె గ్రామానికి వెళ్లే రస్తాలో అంబాపురం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు కైప వెంకట నరసింహశాస్త్రీ, మార్కండేయ శర్మ, శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి గంగ పూజ, గణపతి పూజ, స్వస్తి వాచనం, మాతృకాపూజ, కలశ స్థాపన, యంత్ర అభిషేకం, స్వామి ప్రతిష్ఠ, నవగ్రహ హోమం, గణపతి హోమం, పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎం.చంటి నరసింహారెడ్డి, కోట్టం మద్దిలేటి, టి.శేఖర్‌రెడ్డి, రవిచంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల విజేత నాగర్ కర్నూలు



మూడురాళ్లపల్లెలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న షబ్బీర్ అహ్మద్

మండలంలోని అంబాపురం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో నాగర్ కర్నూలు జిల్లా రాయవరం వృషభాలు విజేతగా నిలిచాయి. నిర్వాహకుడు పూలి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 6 పళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. 13 జతల ఎద్లు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో నిలిచిన రాయవరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డికి రూ. 35 వేలు, రెండో స్థానంలో నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరుకు చెందిన సుబ్రమణ్యేశ్వరరెడ్డికి రూ.25 వేలు, మూడో స్థానంలో వైఎస్సార్ జిల్లా, కలసపాడు గ్రామానికి చెందిన బేతి వెంకటరెడ్డికి రూ.15 వేలు చొప్పున అందజేశారు. అలాగే నాల్గో స్థానంలో నంద్యాల జిల్లా, నోస్సం గ్రామానికి చెందిన హరినాథ్‌రెడ్డికి రూ.10 వేలు, ఐదో స్థానంలో సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి, ఆరో స్థానంలో కోవెలకుంట్ల గ్రామానికి చెందిన పవన్ కుమార్‌కు రూ.5 వేల చొప్పున దాతలు ముల్లా చక్రం షబ్బీర్ అహ్మద్, పరమేశ్వరరెడ్డి, మహబూబ్‌బాషా, మహమ్మద్ రఫీ, రెడ్డిచర్ల రామక్రిష్ణ కమిటీ సభ్యులు అందజేశారు.

నదుల అనుసంధానానికి ప్రాధాన్యతనివ్వాలి

నంద్యాల(రూరల్): రాయలసీమలోని ప్రజాసంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని నదుల అనుసంధానానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో కోరారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులు, నదుల అనుసంధానం, చెరువులు, ఉప నదుల అభివృద్ధి తదితర సమస్యలపై లేఖ రాశారు. కృష్ణాలో నీటి లభ్యత ఉన్నప్పటికీ తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదని, ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

'వక్ఫ్ బచావో'ను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈనెల 24వ తేదీన విజయవాడలో జరిగే వక్ఫ్ బచావో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, నాయకులు సలాంఖాన్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు భూములను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసేందుకు సవరణ బిల్లు కమిటీ పేరుతో ముసాయిదా నివేదిక ఇచ్చేందుకు ప్రయతిస్తున్నారని, వెంటనే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక వక్ఫ్ బచావో పేరుతో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. రియాజ్, జిలానీ బాషా, మజీద్ పాల్గొన్నారు.

వొకేషనల్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో వొకేషనల్ టీచర్ సునీత, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి ఆధ్వర్యంలో వొకేషనల్ విద్యలో భాగంగా టైలరింగ్ అభ్యసించే విద్యార్థినులు శుక్రవారం గడివేములలోని జేఎస్‌డబ్ల్యూ జూట్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ ఉపయోగించే కుట్టుమిషన్లు, బ్యాగ్స్, కుట్టే విధానం, కంప్యూటర్ కుట్టు మిషన్ల గురించి తెలుసుకున్నారు. పని చేస్తున్న సిబ్బంది నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి శుక్రవారం జైలు శిక్ష ఖరారు చేసినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. వివరాలు.. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం, ఖలీల్ గ్రామంలో దారిన వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా సైగలు చేస్తూ ఈలలు వేస్తున్నారని స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఏడు రోజులపాటు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు వివరించారు.

పోలీసులు శారీరక దృఢత్వం కలిగి ఉండాలి



డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: పోలీసులు ప్రతి రోజు వ్యాయామం చేసి శారీరకంగా దృఢత్వం కలిగి ఉండాలని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యాలయ ఆవరణలో సబ్ డివిజన్‌లో పోలీస్ సిబ్బందికి వీక్లీ పేరేడ్ డ్రిల్‌ను శుక్రవారం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే కార్యక్రమానికి సాయుధ బలగాల పోలీసులు, సివిల్ పోలీసులు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. పేరేడ్ డ్రిల్ ద్వారా శారీరకంగా , మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు కిల్కారి సేవలు అందించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

గోస్పాడు: గర్భిణులు, బాలింతలకు కిల్కారి అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాల డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద కిల్కారి సేవలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా తల్లీ బిడ్డల ఆరోగ్యాన్ని సంబంధించి అవసరమైన సలహాలు, సంబంధించిన వారి మొబైల్ ఫోన్‌లో ప్రతి వారం డాక్టర్ ద్వారా అందజేస్తారన్నారు. ఈ ఫోన్ కాల్స్‌ను తల్లి గర్భాధారణను మొదలు కొని బిడ్డకు ఒక సంవత్సరం వచ్చే వరకు ప్రతి వారం ఆర్‌సీహెచ్‌లో రిజిస్టేషన్ చేసుకున్న మొబైల్ ఫోన్‌కు ఫోన్‌కాల్స్ వస్తాయన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మిప్రసన్న, కిల్కారి ఆఫీసర్ డాక్టర్ కీర్తి, డాక్టర శ్రీజా, డిస్ట్రిక్ట్ కమిటి మొబిలైజర్ చిన్న వీరన్న పాల్గొన్నారు.

రోబోటిక్ చికిత్సలతో నిర్దిష్ట ఫలితాలు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

నంద్యాల(వ్యవసాయం): రోబోటిక్ శస్త్ర చికిత్స వల్ల మెరుగైన నిర్దిష్ట ఫలితాలు సాధించడానికి అవకాశం ఏర్పడిందని, ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గుతుందని యశోద హాస్పిటల్ సీనియర్ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఐఎంఏ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, హైదరాబాద్ యశోద హాస్పిటల్ సహకారంతో మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు శుక్రవారం వైద్య సదస్సు నిర్వహించారు. రోబోటిక్ శస్త్ర చికిత్స-ప్రయోజనాలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. గుండె పోటు నివారణపై ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ గురుప్రకాష్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా తగిన వ్యాయామం చేయడం, మితాహారం, దురలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా గుండెపోటు రాకుండా చూసుకోవచ్చన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు తగిన సమయంలో సత్వర చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చున్నారు. ఐఎంఏ నంద్యాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ పనిల్ కుమార్, నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ వసుధ రాణి, యశోద ఆసుపత్రి ఫిజిషియన్ డాక్టర్ నవీన్ రెడ్డి, మేనేజర్ పరమేష్, ఎగ్జిక్యూటివ్ ప్రతినిధి అక్బర్, నంద్యాల ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.

వాల్మీకుల జీవితాల్లో వెలుగులు నింపలేదు

నంద్యాల(అర్బన్): తాము అధికారంలోకి వస్తే వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి వారి జీవితాల్లో వెలుగులు నింపుతామని ప్రకటించిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా హామీ గురించి పట్టించుకోవడం లేదని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం గతంలో కూడా ఇలాగే హామీ ఇచ్చి వాల్మీకులను మోసం చేసిందని గుర్తు చేశారు. నాగేశ్వరరావు, గోపాల్, పెద్దయ్య, శ్రీనివాసులు, సత్యాలు, ఓబులేసు, పరమేష్ పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

చాగలమర్రి: విద్యార్థులకు రక్షణ కల్పించలేని పాఠశాల యాజమాన్యం, హెచ్‌ఎం టి.సుదర్శన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థి సంఘం నాయకులతో కలిసి చాగలమర్రిలోని శ్రీరాఘవేంద్ర ఉన్నత పాఠశాల ఎదుట ధర్నా చేశారు. వారం క్రితం పాఠశాలలో ఓ విద్యార్థినిపై ఓ ఘటన చోటు చేసుకుందన్నారు. తల్లిదండ్రులకు విషయాన్ని తెలపకుండా, ఏమీ జరగనట్లు వ్యవహరించారని ఆరోపించారు.

25 నుంచి బాల్‌రంగ్ ఉత్సవాలు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో జిల్లా స్థాయి బాల్‌రంగ్ ఉత్సవంలో భాగంగా ఈనెల 25 నుంచి 26వ తేదీ వరకు పోటీలు జరగనున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో జాతీయ సమగ్రతను పెంపొందించడానికి, వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక విలువలను తెలుసుకోవడానికి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో 13 నుంచి 15 సంవత్సరాల్లోపు విద్యార్థులు పాల్గొనాలన్నారు. తప్పెట గుళ్ల, కర్రసాము, చెంచులవేట, దింసా, జులారీ, బంజార వంటి జానపద కళారూపాల్లో పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన విద్యాదర్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు కర్నూలు డైట్ లెక్చరర్ ప్రభాకర్‌బాబు సెల్ : 8985126758 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక

డోర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు ఈనెల 17న ఆళ్లగడ్డలోని పాలసాగరం ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో కార్తీక్, నవీసా, మహేష్‌బాబు, బాలికల విభాగంలో అజిజాబీ, క్యావ్యశ్రీ, మాధవి, అనుష్క, నిఖిల ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జయలక్ష్మి విద్యార్థులతో పాటు పీడీ దేవేంద్రను అభినందించారు. ఈనెల 26, 27 తేదీల్లో నందికొట్కూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు చెన్నయ్య, రవిప్రకాశ్, సుదర్శన్‌రెడ్డి, బాల కోటిరెడ్డి, మౌలాలి, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన మహోత్సవం

చాగలమర్రి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం కార్తీక వన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు అనురాధ, సయ్యద్ న్యామతుల్లా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం కార్తీక వన భోజనం నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ గౌస్, నాగరాజు, కోటయ్య, ఉపాధ్యాయులు ఐడీకే శాస్త్రి, సురేషప్ప, మహబూబ్‌బాషా, శివశంకర్, రవీంద్రారెడ్డి, నారాయణమూర్తి, మహబూబ్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి, కల్యాణి, బసవరాజు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ. 25 లక్షలు మంజూరయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి శుక్రవారం తెలిపారు. ఈ నిధులతో కళాశాలలో మైనర్ రిపేర్లు, గదులకు రంగులు వేయడం జరుగుతుందన్నారు. అలాగే కొత్తగా విద్యార్థుల కోసం లైబ్రరీ ఏర్పాటు చేస్తామన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను విద్యార్థులకు సమకూరుస్తున్నామని తెలిపారు.